# చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం

సూళ్లూరుపేట, మే 23 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవి దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం మహాచండీయాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగ మండపంలో ముందుగా గోమాతకు పూజలు చేసిన అనంతరం శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య యాగాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో యాగం ముగిసింది. కోడి గోవిందరాజు దంపతులు యాగానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# వైనతేయునిపై వెంకన్న అభయం



తిరుమల, మే 23ప్రభాతవార్తప్రతినిధి:
నిండుపున్నమివేళ గురువారం రాత్రి మలయప్పస్వామి గరుడునిపై భక్తులను కటాక్షించాడు. వాహనమండపం వద్ద గరుడ వాహనంపై కొలువుదీరి ఆలయ మాఢవీధుల్లో ఊరేగారు.

# విహారాల్లో వారు - వివాదాల్లో వీరు!

## గ్రామాల్లో మైకంవీడని రాజకీయ వీరాభిమానులు

ప్రభాతవార్త, పుంగనూరు

ఎన్నికల పోలింగ్ జరిగి రోజులు గడచిపోతున్నాయి, రాజకీయాలన్నీ చల్లబడ్డాయి. రాష్ట్రంలో ఏదో కొన్ని చోట్ల తప్ప అభ్యర్థుల మధ్యన పోలింగ్ అనంతరం వార్ లేదు. అయితే...అంతా ప్రశాంతమా అనుకంటే తప్పులో కాలేసినట్టే, సిఎం పదవికు పోటీ పడుతున్న జగన్,చంద్రబాబు మొదలు తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశపడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థులతో సహా, మంత్రిపదవులు ఆశిస్తూ.. అపుడే పైరవీలు పూర్తిచేసిన వారితో సహా అందరూ హమ్మయ్య అనుకుంటూ భార్యాబిడ్డలతో, ఫ్రెండ్స్ తో ఎంచక్కా విదేశీయాత్రలు, దేశంలోని పుణ్యక్షేత్రాలు, విహార ప్రదేశాలకు చక్కా వెళ్ళిపోయారు. ఇక్కడే ఒక ట్విస్ట్ ఉంది, నేతలంతా కులాసాగా టూర్‌లకు వెళ్ళినా, గ్రామాలలో మాత్రం పార్టీల అభ్యర్థుల తరఫున పనిచేసిన ద్వితీయశ్రేణి నాయకుల నుంచి కార్యకర్తలు, అభిమానుల వరకు, స్వంతం బంధువులు,అన్నదమ్ముల కుటుంబాల వారు, దాయాదుల కుటుంబాల వారు ఇపుడు మా మధ్యన మాటల్లేవ్, ఏమైనా ఉంటే జూన్ 4 తరువాత చూసుకుందామనుకుంటూ ఇంకా ఎడమొఖం పెడ మొఖంగానే ఉన్నారు. ఇంతకాలం వీరిని నియోజకవర్గాలో చేరదీసి వాడుకున్న బడా నాయకులంతా వీళ్ళని మరచిపోయి ఎంచక్కా ఖుషీలు చేసుకుంటుంటే, కార్యకర్తలుగా, అభిమానులుగా వీర ముద్ర లేసేసుకుని వీరంగమెత్తిన వీరంతా, ఇంకా ఒకరినొకరు చూసుకుని పళ్ళుపటపటా కొరుకుతున్నారు. గ్రామాలు చూసేందుకు ప్రశాంతంగానే ఉన్నప్పటికీ, నాయకుల మీద అంతులేని అభిమానం పెంచుకున్న గ్రామంలో రోజు ఒకరి మొఖం ఒకరు చూసుకోవాల్సిన వారింకా కడుపుల్లో కక్ష్యలతో రగిలిపోతూ, రాజకీయమైకం నుంచి



ఇంకా కోలుకోలేని స్థితిలో ఉన్నారు. నాయకులు సైతం ఎన్నికల సమయంలోని రాజకీయం చేస్తాం...తక్కినపుడంతా మేమొక్కటే అని స్పష్టం చేసిన సందర్భాలెన్ని ఉన్నప్పటికీ, ఈదఫా ఎన్నికలలో నువ్వా? నేనా అన్నంతగా ప్రధాన పార్టీలు పోరాడినా, ఆ పోరాట ప్రభావం అభ్యర్థులను వీడినా, అభిమానులను వీడడంలేదు. ఫలితంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామాలలో పలు కుటుంబాల మధ్యన నోటిమాట ల్లేకుండా పోయాయి. మొగాళ్ళు చేసే రాజకీయాలకు రెండుగా వీడిపోయిన అన్నదమ్ముల బిడ్డలు, ఒకతల్లి బిడ్డలు ఒకరంటే ఒకరు ద్వేషం పెంచుకుని, జూన్ 4తేది ఏ విషయ మూ తేలనీ.. అపుడు చూస్తా నీ కథ అంటూ సవాళ్ళు విసు కుంటున్నారు. వీరి మధ్యన నలిగిపోతున్న కుటుంబాలు, వర్గాల ప్రజలు వీరి అకారణ ద్వేషాల,రోషాల మధ్యన బలైపోతున్నారు. ఇందుకు దృష్టాంతాలుగా రెండు జిలాలలోని గ్రామాలలో సాగుతున్న అల్లర్లు, దమనకాండలు, చంద్రగిరి ఉదంతంలో దాడులకు పాల్పడింది నాయకులు కాదు... వారి అనుచరులైన వీరాభిమానులు. ఇదే విధంగా ఏడాది క్రితం పుంగనూరులో జరిగిన పోలీసులపై రాళ్ళదాడి ఘటనలో బలైపోయింది సాధారణ కార్యకర్తలు. వీరిలో ఇంకా వందలాది మంది అడ్రస్ లేకుండా పోయారు. ఇలాంటి పరిస్థితులలో తమ తమ క్యాడర్‌లకు నచ్చచెప్పి శాంతియుతంగా ఉండాలని బోధించాల్సిన నాయకులంతా ఆ ఇంగితాన్ని కూడా మరచిపోయి, గ్రామాలను కక్ష్యల మధ్యన ముంచేసి, ఎన్నికలయి పోయాయిరా బాబూ అనుకుంటూ వారు మాత్రం షికార్లకు వెళ్ళిపో యారు. ఎవడో పోటీచేస్తే, ఎవడికో ముఖ్యమంత్రి పదవో, మంత్రి పదవో, ఎమ్మెల్యే పదవో వస్తే, సామాన్యుడైన కార్యకర్తలకు ఒరిగేదేమీ ఉండబోదని, వీళ్ళకు చెప్పేవారు లేకపోవడంతో పాటూ, కనీసం మాధ్యమాలు కూడా ప్రచారం చేయక పోవడంతో ఫలితాల తరువాత గ్రామాలలో అల్లర్లు తప్పవని వెల్లడౌతోంది. ఇంత కాలం ఎన్నికల నిర్వహణకు కోట్లు ఖర్చుపెట్టిన ఎన్నికల కమీషన్‌తో పాటూ జిల్లా కలెక్టర్లు కూడా గ్రామాలలో ఈవిధంగా నెలకొన్ని ఎన్నికల అనంతరం పరిస్థితులపై అవగాహన పెంచుకోక, నిర్లక్ష్యంగా ఉండి పోవడం దారుణం. మేధావర్గాలను, పోలీసులను గ్రామాలకు పంపి వారికి వాస్తవ పరిస్థితులు అవగాహన చేసుకునేలా కౌన్సెలింగ్ చేపట్టాల్సిన బాధ్యత ఎన్నికలు నిర్వహించిన జిల్లాల ఉన్నతాధికారులకు ఉండాల్సి ఉంది. ఏది ఏమైనా జూన్ 4 తరువాత రాజ్యభోగం గెలిచిన వారి వంతైతే....పంతాలు. కక్ష్యలు పెంచుకోవడం కార్యకర్తలు, అభిమానుల వంతుగా మిగలనుంది.

# రథోత్సవంలో మెరిసిన గోవిందరాజు



తిరుపతి,మే 23ప్రభాతవార్త:
గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోవిందరాజస్వామి, శ్రీదేవిభూదేవి అమ్మవారి ఉత్సవర్లకు భక్తులు కర్పూర హారతులిచ్చారు. భక్తులు సేవకులుగా రధాన్ని లాగి తన్మయులయ్యారు. గోవిందరాజస్వామి రథోత్సవం సందర్భంగా ఆలయ మాఢవీధుల్లో రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి పండ్లు పంపిణీ చేశారు. రథం లాగిన భక్తులతో బాటు మాఢవీధుల్లో ఉన్న భక్తులకు ఈ పంపిణీ జరిగింది. ప్రతి ఏడాది రథోత్సవాన రాయలసీమ రంగస్థలి పండ్లు పంపిణీ చేస్తారు.

# బిసివై నాయకురాలిపై దాడి

## -ఐదుమందిపై కేసు నమోదు



గాయపడి చికిత్స పొందుతున్న అంజమ్మ

పుంగనూరు,మే 23 ప్రభాతవార్త :
మండలంలోని మాగాండ్లపల్లి పంచాయతీ భరిణేపల్లికు చెందిన అంజమ్మ అనే మహిళ బిసివై పార్టీకు పనిచేసిందన్న కక్ష్యతో అదేగ్రామానికి చెందిన వైసిపికు చెందిన ఐదు మంది బుధవారం రాత్రి వేటకొడవళ్ళతో దాడిచేసి గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల జరిగి ఎన్నికలలో భరిణేపల్లికు చెందిన అంజమ్మ బోడే రామచంద్రయాదవ్ స్థాపించిన బిసివై పార్టీ కోసం చురుకుగా పనిచేసింది. గ్రామగ్రామాలలో ఆమె నాయకత్వంలో బిసివైను బలపరిచేందుకు పర్యటనలు జరిగాయి. దీంతో పాటూ పోలింగ్ తేదీన కూడా ఆమె కీలకంగా విధులు నిర్వర్తించింది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆమె ఇంటిపై బుధవారం రాత్రి దాడిచేశారు. ఇంట్లో ఉన్న అంజమ్మను వేటకొడవళ్ళతో తీవ్రంగా గాయపరిచారు. ఇంతలో కేకలు విని స్థానికులు రావడంతో దుండగులు పరారయ్యారు.చేతులు,కాళ్ళపై కొడవలితో జరిగిన దాడిలో గాయపడిన అంజమ్మ స్థానిక ప్రభత్వ వైద్యశాలలో చికిత్సపొందుతోంది. సిఐ రాఘవరెడ్డి ఆమె వద్దనుంచి వివరాలు తెలుసుకుని అదే గ్రామానికి చెందిన ఐదు మందిపై కేసునమోదు చేశారు. జిల్లా ఎస్సీఎస్టీ డిఎస్పీ విష్ణురఘువీర్ గ్రామాని కి చేరుకుని ఆమె కుటుంబీకులను విచారించారు.

# ఓట్ల లెక్కింపుకు పక్కా ఏర్పాట్లు

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

## కౌంటింగ్ ప్రక్రియకు మూడంచెల భద్రతా - జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్

చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:
జూన్ 4వ తేదీ నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా చేపట్టడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. వెలగపూడి సచివాలయం నుండి గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సార్వత్రిక ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపు ప్రక్రియ సన్నద్ధతపై గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేపట్టాలని, అలాగే ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్, ట్రైనింగ్ పూర్తి చేయాలన్నారు. ఇవిఎంలు, పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాలు వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని, కౌంటింగ్ సెంటర్ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లలో భాగంగా మొదటి వలయంలో సిఏపిఎఫ్ సిబ్బంది, రెండవ వలయంలో ఎస్‌ఏపిఎఫ్ సిబ్బంది, మూడవ వలయంలో సివిల్ పోలీసులతో భద్రత ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 64 సిసి కెమెరాలతో ఓట్ల లెక్కింపు ప్రక్రియను కంట్రోల్ రూమ్ నుండి నిరంతరం పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ, పార్లమెంటు సెగ్మెంట్లకు విడివిడిగా ఇవిఎం కౌంటింగ్ కోసం ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ళు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ విధుల్లో పాల్గొనే సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ శనివారం



రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమీషనర్ వీడియో కాన్ఫరెన్స్‌కు క్యాంపు కార్యాలయం నుండి హాజరైన కలెక్టర్ సగిలి షన్మోహన్.

నిర్వహించి ఈ నెల 28న సిబ్బందికి మొదటి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 టేబుళ్ళు, పార్లమెంటు నియోజకవర్గానికి 18 టేబుళ్ళు ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ క్యాంపు కార్యాలయం నుండి హాజరు కాగా జిల్లా సచివాలయం నుండి పలమనేరు, జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌ఓలు మనోజ్‌రెడ్డి, వెంకటశివలు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ తదితరులు పాల్గొన్నారు.

# అల్లర్లకు పాల్పడితే ఉక్కుపాదంతో అణచివేస్తాం..!

## చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవు..! : తిరుపతి జిల్లా ఎస్పీ

## సి.రామాపురం పంచాయతీలో ఫ్లాగ్ మార్చ్



రామచంద్రాపురం, మే 23 ప్రభాతవార్త:
ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తూ ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఉక్కుపాదంతో అణచివేస్తామని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున బ్రాహ్మణకాలువలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలతో ప్రత్యేక బలగాలు గాలిలోకి కాల్పులు జరిపిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో గురువారం సి.రామాపురం పంచాయతీలో ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరుతూ కేంద్ర సాయుధ బలగాలు, పోలీసు ఉన్నతాధికారులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసులు, డిఎస్పీలు శరత్‌రాజ్‌కుమార్, రవీంద్రారెడ్డి, ఎస్ఐ చిరంజీవి, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

# శ్రీపద్మావతి అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

తిరుచానూరు, మే 23 ప్రభాతవార్త:
తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వసంతోత్సవాల్లో రెండో రోజు గురువారం నెమలి ఈకలు, గాజులు, ముత్యాలతో ప్రత్యేకంగా రూపొందించిన మాలలతో స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. మధ్యాహ్నం 2.30 గంటలకు అమ్మవారి ఉత్సవర్లకు శుక్రవారపు తోటలో వేదమంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, కుంకుమ, చందనలతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు అమ్మవారు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ అర్చకులు శ్రీ బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, భక్తులు పాల్గొన్నారు.



## సింహ, ముత్యపుపందిరి వాహనాలపై

# కల్యాణ వేంకటేశ్వరుని విహారం





నారాయణవనం, మే 23 ప్రభాతవార్త :
నారాయణవనం పుణ్యక్షేత్రంలో వెలసిన పద్మావతీదేవిసమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి గురువారం ఉదయం కల్యాణ వేంకటేశ్వరుడు సింహవాహనాన్ని అధిరోహించి నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 9గంటలకు కల్యాణ వేంకటేశ్వరున్ని ముత్యపుపందిరి వాహనంపై మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాడనము నిర్వహించారు. సింహవాహనంపై ఊరేగిన కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ పార్థసారధి, సూపర్‌టెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు, నరసింహరాఘవ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# మాల్‌లో మద్యం నిల్... బార్లలో ఫుల్

## ప్రవేట్ బార్ల యాజమాన్యంతో.... అబ్కారీ శాఖ కుమ్మక్కు

## మందుబాబుల జేబులకు చిల్లుపెడుతున్న ఎక్సైజ్ అధికారులు

తిరుపతిరూరల్, మే 23 ప్రభాతవార్త:
ఆంధ్రలో నాణ్యతలేని మద్యం అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోఫణలు రాష్ట్ర ప్రభుత్వం మూటగట్టుకున్న విషయం తెల్సిందే. దీనికితోడు ప్రభుత్వం నిర్వహించే మద్యం మాల్స్, మద్యం దుకాణాలలో మద్యం లేకుండా పేరుకే నామ మాత్రంగా నాశిరకం మద్యం విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రవేట్ బార్లలో అన్ని రకాల మద్యం బ్రాండ్స్ దొరకడం ఏమిటి!. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మాల్స్, మద్యం షాపులలో మాత్రం మద్యం దొరకపోవడం ఏమిటని మందుబాబులు ప్రశ్నిస్తున్నారు. అబ్కారీ శాఖ అధికారులు ప్రవేట్ బార్ల యాజమాన్యంతో కుమ్మకై నెలవారీ మామూలు మత్తులో జోగుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మాల్స్, మద్యం దుకాణాలలో మద్యం సరఫరా చేయకుండా, కేవలం ప్రవేట్ బార్లకే మద్యం సరఫరా చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, మందుబాబుల జేబులకు చిల్లుపెడుతున్నారు. ప్రవేట్ బార్లలలో మద్యం బ్రాండ్స్‌ను 40, 50 శాతం అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసే విధంగా అబ్కారీ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల కంటే ప్రవేట్ బార్లలో 20శాతం మాత్రమే అధిక ధరలకు విక్రయించాల్సి ఉంది. అబ్కారీ శాఖ నిబంధనలను ప్రవేట్ బార్ల యాజమానులు ఉల్లంఘిస్తూ ఖచ్చితమైన ధర అంటూ ఎమి లేకుండా విచ్చలవిడిగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో మొక్కబడిగా ఎప్పుడు కానరాని, కనివిని ఎరగని మద్యం బ్రాండ్స్ విక్రయిస్తూ మద్యం ప్రియులను అయోమయానికి గురి చేస్తున్నారు.మద్యం ప్రియులు బార్లకు వెళ్ళి అధిక ధరలు చెల్లించి మద్యం కొనుగోలు చేయలేక ఎదోఒక బ్రాండ్స్‌తో సరిపెట్టుకునే దుస్థితికి తీసుకొచ్చారు. తిరుపతి, తిరుపతి పరిసర ప్రాంతాలలో ఉండే ప్రభుత్వ మద్యం దుకాణాలలో ఎక్కడా కూడా 'ప్రిమియం లిక్కర్ బ్రాండ్స్' కనబడుటలేదని మద్యం ప్రియులు వాపోతున్నారు. ప్రవేట్ బార్లలో మాత్రం ప్రిమియం బ్రాండ్స్ విచ్చలవిడిగా లభిస్తాయి. కానీ ప్రభుత్వ మద్యం షాపులలో బూతద్దం పట్టి ఎతికినా కనిపించవు.







ఇదంతా ఆబ్కారి అధికారుల లీలగా భావించవచ్చు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో ప్రిమియం లిక్కర్ బ్రాండ్స్ లేనందున.... మందుబాబులు ప్రిమియం లిక్కర్ బ్రాండ్స్‌ను బార్లలో కొనుగోలు చేయాలంటే క్వార్టర్ బాటిల్‌పై రూ.50 రుపాయాల నుండి రూ.80 అదనంగా చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గుండెనొప్పితో సీనియర్ వైకాపా నేత చంద్రరాజు మృతి

పాలసముద్రం, మే 23 ప్రభాతవార్త:



పాలసముద్రం గ్రామంకు చెందన వైకాపా సీనియర్ నాయకుడు చంద్రరాజు(65) గుండెనొప్పితో గురువారం సాయంత్రం మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం చంద్రరాజుకు గుండెనొప్పి రావడంతో ఆయను చికిత్స నిమిత్తం చెన్నైలోని ఆసుపత్రికి తరలించారు. ఒక వారం రోజుల క్రితమే ఆయన ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకొంటున్న చంద్రబాబు గురువారం సాయంత్రం వున్నట్లు వుండి తుదిశ్వాస విడవడంతో వైకాపా నాయకులు, కార్యకర్తలను కలచివేసింది. మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్ మండల స్థాయిలో పార్టీ ఉన్నతికి పాటు పడిన వ్యక్తి చంద్రరాజు మన మధ్య నుండి వెళ్ళిపోవడం బాధగా వుందని పేర్కొన్నారు. ఈ మేరకు చంద్రరాజు అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.

# తొలిరోజు రైతులకు 680 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు పంపిణీ

కుప్పం, మే 23 ప్రభాతవార్త



ఖరీఫ్ సీజనులో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీతో అందించే వేరుసెనగ విత్తనాల పంపిణీని గురువారం మండలంలో వ్యవసాయాధికారి అమృతవల్లి ప్రారంభించారు. మండలంలో 24 రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు విత్త నాలను పంపిణీ చేశారు. తొలిరోజే ఆయా ఆర్‌బికెల పరిధిలోని రైతులకు అత్యధికంగా 680 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలను అందించారు. రైతులు కూడా విత్తనాల బస్తాలు పొందేందుకు ఉత్సాహం చూపారు. కార్యక్రమాల్లో ఎఇఒ ఔరంగ్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.కుప్పంమున్సి పాలిటీపరిధిలోశుక్రవారంరైతులకువేరుసెనగవిత్తనాలపంపిణీ ప్రారంభించను న్నారు.

**రామకుప్పం :** మండలంలో వేరుసెనగ విత్తనాల పంపిణీని తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఒ ఈశ్వరయ్య ప్రారంభించారు. రైతులు రాయితీ వేరుసెనగ విత్తనాలను పొందాలని రాయితీతో రూ 1710లకే ముప్ఫై కిలోల బస్తాను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు.

# పాత్రికేయుడిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

కుప్పంరూరల్, మే 23 ప్రభాతవార్త



కుప్పం పట్టణంకు చెందిన పాత్రికేయుడు దుర్గా ప్రసా ద్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. ఈ మేరకు బాధిత విలేకరితో పాటు మిగతా పాత్రికేయులు కుప్పం అర్బన్ సిఐ రమణకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. గురు వా రంస్థానికశ్రీతిరుపతిగంగమాంబ అమ్మవారి ఆల యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. పలువురు పాత్రికేయులు అక్కడే ఉండి కార్యక్రమాన్ని చిత్రీకరించడంతో పాటు ఫోటోలు తీశారు. కాగా ఈ సమయంలోనే ఫ్యాన్ వేయమని దుర్గా ప్రసాద్ చెప్పడంతో అక్కడే ఉన్న హరి, లోకేష్ అనే వ్యక్తులు దుర్గా ప్రసాద్‌పై ఒక్కసారిగా దాడికి దిగారు. ఇక్కడ మీకేం పని అంటూ పాత్రికేయులపై చిందులేశారు.మరో ముగ్గురు రిపోర్టర్లపై దాడికి యత్నించారు. దీంతో స్థానిక పాత్రికేయులు దుర్గా ప్రసాద్‌పై జరిగిన దాడినిఖండిస్తూ అర బ్బన్ సిఐరమణకు ఫిర్యాదు చేయగా సిఐ విషయాన్ని డిఎస్పీ శ్రీనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. పాత్రికేయులకు న్యాయం చేస్తామని అర్బన్ సిఐ హామీ ఇచ్చారు.

# అక్రమంగా విక్రయిస్తున్న 160 లీటర్ల పెట్రోల్ సీజ్

పలమనేరు,మే 23,ప్రభాతవార్త:

పలమనేరు మండలంలో అక్రమంగా పెట్రోల్ విక్రయి స్తున్న రెండు చిల్లర దుకాణాలలో 160లీటర్ల పెట్రోల్ ను గురువారం సీజ్ చేసినట్లు పలమనేరు తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్,జిల్లా జేసి ఆదేశాల మేరకు మండలంలో అక్రమంగా పెట్రోల్ విక్రయి స్తున్న వారిపై చర్యలలో భాగంగా మండలంలోని నక్కపల్లె వద్ద రెండు చిల్లర దుకాణాలలో వాటర్ బాటిల్‌లలో విక్రయానికి నిలువ చేసిన 160లీటర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. డి.టి రుషివర్మ,విఆర్‌ఓ సిద్దేశ్వర్ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా పెట్రోల్,టపాకాయల విక్రయాలు చేస్తే చర్యలు తప్పవు

వి.కోట,మే 23,ప్రభాతవార్త:



అక్రమంగా పెట్రోల్,టపాకాయల విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేష్ కుమార్,సిఐ లింగప్ప హెచ్చరించారు.గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 13 జరిగిన ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న ఉన్న క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలో భాగంగా పెట్రోల్ బంకులలో బాటిల్‌లలో పెట్రోల్,డీజల్ విక్రయాలు చేపట్టరాదని,అక్రమంగా దుకాణాలలో ఎవరైన విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని టపాకాయల దుకాణాలను పరిశీలించి టపాకాయాల నిలువలను నమోదు చేసుకునట్లువారుతెలిపారు.ఈకార్యక్రమంలోఎస్ఐమోహన్‌రెడ్డి,పెట్రోల్ బంకుల నిర్వాహకులు,టపాకాయల దుకాణ దారులు పాల్గొన్నారు.

# పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు ఆహ్వానం

వెదురుకుప్పం, మే 23 ప్రభాతవార్త :

పండ్లతోటల పెంపకంకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడివో వరప్రసాద్ గురువారం తెలిపారు. ఉపాధిహామి పథకం ద్వారా పండ్లతోటలు పెంపకంకు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల రైతులు మండల కేంద్రంలోని ఉపాధిహామి కార్యాలయంలోగాని, పంచాయితీ కార్యాలయాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ వద్దగాని దరఖాస్తులు అందించవచ్చన్నారు. సన్న, చిన్నకారు రైతులు ఐదు ఎకరాల లోపు భూమిగల రైతులు పథకంకు నమోదు చేయడానికి అర్హులని తెలిపారు. మామిడి,కొబ్బరిచెట్లు, జామ, అల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్,నిమ్మ, దానిమ్మ, రోజా పూలతోటలు, మల్లెపూల తోటలు, మునగ తోటలు వంటి పది రకాలు ఉపాధి పథకం ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు.

# పెట్రోల్ బంకు యాజమానులకు షాక్

- క్యాన్లు, బాటిళ్ళు, డ్రమ్స్‌లో పెట్రోల్, డీజీల్ పడ్తే లైసెన్స్ రద్దు
- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:



జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వుండటంతో ప్రతి ఒక్కరు ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు నడచుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పెట్రోల్, డీజీల్ బంకు యాజమానులకు స్పష్టం చేశారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో ఎక్కడా క్యాన్లు, బాటిళ్ళు, డ్రమ్స్‌ల్లో పెట్రోల్, డీజీల్‌ను పట్టరాదని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం జెసి పి.శ్రీనివాసులు జిల్లా పౌరసరఫరాల అధికారి శంకరన్‌తో కలిసి పెట్రోల్ బంకు యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు ఎన్నికల నియమాలు వుండటంతో జిల్లాలోని పెట్రోల్ బంకు యాజమానులు ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యే వరకు, తదుపరి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఉత్తర్వులు వచ్చే వరకు పెట్రోల్, డీజీల్‌ను డ్రమ్స్, క్యాన్లు, బాటిళ్ళల్లో పట్టరాదని స్పష్టం చేశారు. ఎవరైనా ఈ విషయంపై అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పెట్రోల్ బంకు లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బ్యాంకులు, సెల్ టవర్స్, హ్యాండ్లూమ్ వారికి జనరేటర్ల వినియోగం కోసం పెట్రోల్, డీజీల్ అవసరం వుంటుందని, అలాంటి వారు సంబంధిత తహసిల్దారు నుండి ఎండార్స్‌మెంట్ లెటర్ తీసుకొని తహసిల్దారు మంజూరు చేసిన మేరకు పెట్రోల్, డీజీల్‌ను వారి క్యాన్లు, డ్రమ్ముల్లో నింపాలని పెట్రోల్ బంకు యాజమానులను కోరారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ ఎఎస్‌ఓ శివరామరాజు, పెట్రోల్ బంకు యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు 3 పరీక్షా కేంద్రాల్లో డివైఇఓ నియామక స్క్రీనింగ్ టెస్ట్

- కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:

ఎపి పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో శనివారం డిప్యుటీ ఎడ్యుకేషనల్ అధికారుల నియామకం కోసం కంప్యూటర్ బేస్డ్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగనున్నట్లు కలెక్టర్ సగిలి షన్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థుల కోసం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రం చిత్తూరులోని సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల, పూతలపట్టు మండలంలోని వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గంగవరంలోని మధర్ థెరిసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రాల్లో పరీక్షలు వుంటాయన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 11.30 గంటల వరకు అబ్జెక్టివ్ తరహాలో పరీక్షలు నిర్వహించబడుతాయని, ఉదయం 7 గంటల నుండి 8.30 గంటలలోపు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఒక్క క్షణం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగదని ఈ విషయంను అభ్యర్థులు గుర్తించి సకాలంలో పరీక్షలకు హాజరు అయ్యేలా చూసుకోవాలని ఆయన కోరారు.

# వేరుసెనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తనిఖీ చేసిన ఎడి

ఎస్ఆర్‌పురం, మే 23 ప్రభాతవార్త:



ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లిమిట్ట రైతు భరోసా కేంద్రంలో గురువారం జరుగుతున్న సబ్సిడీ వేరుసెనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నగరి వ్యవసాయశాఖ ఎడి సౌభాగ్యలక్ష్మీ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేసి రైతులకు పంపిణీ చేసిన విత్తనాల వివరాలను సరి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలుగకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టి సత్వరం విత్తనాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మండల పరిధిలో రైతులకు ఏ మేరకు వేరుసెనగ విత్తనాలు అవసరం! ప్రస్తుతం ఏ మేరకు విత్తనాలు అందుబాటులో వున్నాయి! అనే విషయాలపై ఎఓ నర్మదతో ఆమె చర్చించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

# చౌడేపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా మణిసింగ్

చౌడేపల్లి, మే 23 ప్రభాతవార్త

చౌడేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా సుబ్రమణ్యంసింగ్ ఎన్నికయ్యారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్ష పదవికి సుబ్రమణ్యంసింగ్, ఉత్తరాది హరిప్రసాద్‌లు పోటీ పడ్డారు. అనంతరం జరిగిన ఓటింగ్‌లో సుబ్రమణ్యంసింగ్ 9ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అదే విధంగా ఉపాధ్యక్షుడిగా కూరపర్తి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షిడుగా ఐ ఎం రామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాసులు, కోశాధికారిగా ఆర్.లక్ష్మీకుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మండలంలో రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ



పలమనేరు టౌన్, మే 23 ప్రభాతవార్త:

పలమనేరు మండలంలోని 2024 ఖరీఫ్‌లో వ్యవసాయ శాఖ రాయితీపై వేరుశనగ విత్తనా లను పలమనేరు మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాలలో గురువారం పంపిణీ చేశారు. మండలం మొత్తం 1035 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగింది.తహసీల్దార్ వై రంగనాయకులు,ఎంపిడిఓ విద్యాసాగర్ పర్యవేక్షణలో రైతులకు బయోమెంట్రిక్ విధానం ద్వారా పంపిణీ చేపట్టారు.30 కిలోల భస్తా రూ.2850 ఉండగా ప్రభుత్వం ద్వారా రూ.1140 సబ్సీడీ అందడంతో రైతులు రూ.1710 చెల్లించి కొనుగోలు చేసుకోవల్సి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.8.38లక్షలు

పలమనేరు, మే 23 ప్రభాతవార్త:



పలమనేరు పట్టణంలోని తిరుపతి గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.8.38 లక్షలు వచ్చినట్లు దేవాదాయ శాఖ కార్యాలయం అధికారి రాధిక తెలిపారు. పలమనేరు పట్టణంలో ఈ నెల 20,21,22న జరిగిన గంగజాతర సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి వారి మొక్కులను తీర్చుకున్నారు.ఈ మేరకు గురువారం ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి రూ.838, 374 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ వేలం ద్వారా 5.50 లక్షలు ఆదాయం

తవణంపల్లె, మే 23 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామివారి దేవస్థానంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వివిధ లీజు హక్కుల కోసం గురువారం నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా 5.50 లక్షల రూపాయలు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ టి.హనుమంతరావు తెలిపారు. గురువారం దేవస్థానం వద్ద వివిధ లీజు హక్కుల కోసం బహిరంగ వేలం పాటలను నిర్వహించారు. దేవస్థానం వద్ద భక్తులు సమర్పించే తలనీలాలు ప్రోగుచేసుకునే లీజు హక్కు వేలం ద్వారా 4.50 లక్షలు ఆదాయంగా వచ్చినట్లు తెలిపారు. అలాగే కొబ్బరి చిప్పలు సేకరించుకునే లీజు హక్కు మంజూరుకు నిర్వహించిన వేలం పాట ద్వారా లక్ష రూపాయలు ఆదాయంగా వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈవేలం పాటలలో దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ సుమనప్రియ, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వ్యాపారస్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# వేరుసెనగ విత్తనాలు పంపిణీ

పుంగనూరు, మే 23 ప్రభాతవార్త :



మండలంలో గురువారం నుంచి రైతులకు వేరుసెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి రాజేస్ సారథ్యంలో ప్రారంభించారు. విత్తన కాయల కోసం ఇదివరకే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి వారి క్రమసంఖ్య ప్రకారం ఆయా ఆర్‌బికేల పరిధిలో విత్తనాలను అందించామన్నారు. వేరుసెనగ విత్తనాల పంపిణీతో పాటూ విత్తనాలను అదనులో విత్తడం మొదలు తీసుక ఓవాల్సిన జాగ్రత్తల గురించి ప్రతి ఆర్‌బికే పరిధిలోని అన్ని గ్రామాల రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. తొలి రోజున ఆరువందల క్వింటాళ్ళ విత్తనాల పంపిణీజరిగిందన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

# వైభవంగా నరసింహస్వామి ఆదిలక్ష్మి చెంచులక్ష్మి కళ్యాణం

చిల్లకూరు, మే 23, ప్రభాతవార్త



మండల పరిధిలోని కలవకుండ గ్రామంలో కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు లక్ష్మీనరసింహస్వామి కళ్యాణంను పురస్కరించుకుని దేవస్థానంని తీర్చిదిద్దారు. ఉదయం సుప్రభాత సేవ నిత్య హోమాలు, పూర్ణాహుతి సహస్ర పారాయణం నిర్వహించారు. సపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం దాతల సహాయంతో ఘనంగా గజ వాహన సేవ నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. రాత్రి భక్తుల వినోదం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను ఆలయ ఇఓ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పరిరక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవారు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# భాస్కర్ రెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే ఆనం

వెంకటగిరి టౌన్, మే 23, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ నాయకుడు చెలికం భాస్కర్ రెడ్డి మృతి తీరని లోటని ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సీనియర్ టిడిపి నాయకుడు భాస్కర్ రెడ్డి భౌతికాయానికి ఆయన పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి తీరని లోటు అనేది చెప్పారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. భాస్కర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

# భాస్కర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు : లక్ష్మిసాయి ప్రియ

వెంకటగిరి టౌన్, మే 23, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెలికం భాస్కర్ రెడ్డి పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మి సాయి ప్రియ తెలిపారు. ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శులు గంగోడు నాగేశ్వర రావు, జెన్ని పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, మాజీ జడ్పిటిసి ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, మాజీ ఎంపిపి పోలవరం రెడ్డి, వెంకట్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోటేశ్వర్ రెడ్డి, తదితరులు సంతాపం తెలిపారు.

# సగం ధరకే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ఏడిఏ నాగార్జున సాగర్

వెంకటగిరి టౌన్, మే 23, ప్రభాతవార్త



రైతులకు సగం ధరలకే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏడి ఏ నాగార్జున సాగర్ తెలిపారు. జీలుగా, పిల్లి పెసర, జనము విత్త నాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వెంకటగిరి మండలానికి జీలుగ 230, జనుము 129 టన్నులు, బాలాయపల్లి మండలానికి 161, 155 టన్నులు వచ్చినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఘనంగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ జన్మదిన వేడుకలు

గూడూరులో మేరిగ విజయం తథ్యం

వైసిపి పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు

గూడూరు, మే 23, ప్రభాతవార్త



గూడూరు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ 57వ జన్మదిన వేడుకలు గురువారం గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో ఏర్పాటై ఉన్న పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు భారీ కేక్‌ను కట్ చేసి అక్కడి వారందరికీ పంచి పెట్టారు. ఈ వేడుకల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, నాయకులు నాశిన నాగులు, నారాయణ రెడ్డి, పెంచల్ రెడ్డి, సుభాన్, బుజ్జి, రూపేష్ రెడ్డి, అనుదీప్, రుదీప్ రెడ్డి, సునీల్ రెడ్డి, ఎంపిపి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న

మయూరి శ్యామ్ యాదవ్

గూడూరు, మే 23, ప్రభాతవార్త



అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని శ్రీ కృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని గమళ్ళపాలెం ప్రాంతంలో ఉన్న మెప్మా సౌజన్యంతో మై ఫ్రెండ్స్ అసోసియేషన్ వసతి గృహం నందు మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్ఫధాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేత ఎంఆర్‌సిరెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కుట్రలు

- వైసీపీ శ్రేణులు ఆగ్రహం

కోట, మే 23 ప్రభాతవార్త

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకులు ఎంఆర్‌సి రెడ్డి ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారని, అలాంటి రాష్ట్ర నాయకుడినే పార్టీ సస్పెండ్ చేయడం బాధాకరమని వైసీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో అందరినీ సమన్వయపరుస్తూ గ్రూపులన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆయన సేవలను గుర్తించి పలుమార్లు ఎంఆర్‌సి రెడ్డిని అభినందించారు. ఆయన ఎదుగుదలను ఓర్వలేక కొంతమంది దురుద్దేశపూర్వకంగా ఎంఆర్‌సి రెడ్డిపై దుష్ప్రచారాలు చేశారని ఆరోపిస్తున్నారు. గూడూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళిని అధికారులు పలురకాలుగా ఇబ్బంది పెట్టినా ఎంఆర్‌సి రెడ్డి జోక్యం చేసుకొని అధికారుల చర్యలను ఖండించారు. అటు తిరుపతి పార్లమెంటు అభ్యర్థి గురుమూర్తికి జనరల్ ఏజెంట్‌గా, నియోజకవర్గ పరిశీలకులుగా 40రోజుల పాటు తిరుపతి పార్లమెంటు పరిధిలో నాయకులందరినీ కలుపుకుంటూ ముందుకుపోయి పార్టీ అభ్యర్థుల కోసం కృషి చేసిన ఎంఆర్‌సి రెడ్డిపై చర్యలు తీసుకోవడం బాధాకరమని వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఎమ్మెల్యే పిన్నెల్లిని పోటీకి అనర్హుడిగా ప్రకటించాలి

కోట, మే 23 ప్రభాతవార్త

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎన్నికల సంఘం అనర్హుడిగా ప్రకటించాలని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ బిసిసెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు కోరారు. ఆయన గురువారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ఇవిఎంలను ధ్వంసం చేసినట్లు తెలిసినా రాష్ట్ర ఎన్నికల సంఘం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించే వరకు ఏమి చేస్తున్నారని తీగల సురేష్‌బాబు ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉంటూ ఇవిఎంలను ధ్వంసం చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన ఈ ఘటనకు పాల్పడ్డారని తెలిసినా అధికార యంత్రాంగం వెనువెంటనే చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు.

# సూళ్లూరుపేటలో కార్డన్ సెర్చ్

సూళ్లూరుపేట, మే 23 ప్రభాతవార్త



రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణ పరిధిలోని వత్రపాలెంలో కార్డన్ సెర్చ్ సిఐ మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి అనుమతులు లేని 16 మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌లో ఉంచారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కార్డన్ సెర్చ్ చేపడుతున్నట్లు సిఐ మధుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, తడ ఎస్ఐలు రహీంరెడ్డి, నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెలికం భాస్కర్ రెడ్డి మృతికి సంతాపం తెలిపిన నేదురుమల్లి రాజ్యలక్ష్మి

వెంకటగిరి టౌన్, మే 23, ప్రభాతవార్త

డక్కిలికి చెందిన పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు చెలికం భాస్కర్ రెడ్డి మృతి పట్ల మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి సంతాపం తెలిపారు. చెలికం భాస్కర్ రెడ్డి సుదీర్ఘకాలం పాటు రాజకీయంగా నేదురుమల్లి కుటుంబంతో నడిచారని, ఆయన మరణ వార్త విని చాలా బాధపడినట్లు తెలిపారు. ఆయన మరణం వ్యక్తిగతంగా, డక్కిలి మండలం రాజకీయాలకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు, ఆ బాధను తట్టుకునే శక్తి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని ఆమె తెలిపారు.

# లూస్ పెట్రోల్, డిజీల్ అమ్మకాలు నిషేధం

- బంకు నిర్వాహకులకు నోటీసులు జారీ చేసిన కమీషనర్

చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పరిధిలో పెట్రోల్ బంకులు, ఇతర దుకాణాల్లో లూస్‌గా పెట్రోల్, డీజీల్‌ను క్యాన్లు, బాటిళ్ళల్లో విక్రయించరాదని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ స్పష్టం చేశారు. ఈ మేరకు నగర పరిధిలోని 21 పెట్రోల్ బంకు నిర్వాహకులకు మున్సిపల్ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. పెట్రోల్ బంకుల్లో ఎక్కడా విడిగా క్యాన్లు, బాటిళ్ళలో పెట్రోల్, డీజీల్ నింపి విక్రయించరాదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆటవిక ప్రజాస్వామ్యం

- సిఎం జగన్‌పై రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల ధ్వజం

చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:



పోలింగ్ రోజు, ఆ తరువాత వైకాపా ఎమ్మె ల్యేలు, నాయకులు పక్కా ప్రణాళికతో ప్రజలు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్త లపై మరణాయుధాలతో దాడి చేశారని, ముందెన్నడు లేని విధంగా హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడం, దీనికి కొంతమంది పోలీసు అధికారులు ఏకపక్షంగా విధులు నిర్వహించి సహకరించడం దారుణమని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిది వెంకిటీల సురేంద్రకుమార్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఆర్‌ఓలు వైకాపా ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకుల ఒత్తిడి భరించలేక తాము విధులు నిర్వర్తించలేమని మెడికల్ లీవు మంజూరు చేయాలని ఎలక్షన్ కమీషన్‌కు వినతులు చేయడం దురదృష్టకరమన్నారు. తాడిపత్రి, చంద్రగిరి, మాచర్ల, నరసరావుపేట, తెనాలి ఇతర నియోజకవర్గాల్లో జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి సిట్ దర్యాప్తు నివేదికను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో దేశం మైనార్టీ నాయకులు జాఫర్, పూతలపట్టు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ధరణి తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు, బిఎన్‌కండ్రిగ మండలాల్లో

### ఆసియన్ బ్యాంకు బృందం పర్యటన



తొట్టంబేడు, మే 23 ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం రోడ్లు మరియు భవనాలశాఖ రోడ్డు విస్తరణ అభివృద్ధికి శ్రీకారంచుట్టారు. ఈనేపధ్యంలో తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల్లో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు బృందం పర్యటించారు. ఇందులో భాగంగా విశాఖపట్నం-చెన్నై ఇండ్రస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎడిబి) ఆర్థిక సాయంతో నెలబల్లి-రౌతుసూరమాల మీదుగా శ్రీకాళహస్తి నుంచి ఏర్పేడు నుంచి పల్లమాల వరకు 9.5కి.మీ పొడవు, 22.5మీ వెడల్పుగా ఒవైపు రెండు వైపులా 45మీ.వెడల్పుతో 4లేన్ల రోడ్డును విస్తరించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు బృందంక్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా శ్రీకాళహస్తి నుంచి పల్లమాల వరకు 9.5కి.మీ పొయ్య, గుమ్మడిగుంట, గౌడమాల గ్రామల్లో కొత్తపాళెం, పల్లమాల గ్రామాల్లో రోడ్డు వెంబడి నష్టపోయే ఇండ్లను పంటలను ప్రభుత్వ ఆస్తులను పర్యటించారు. ఇందులో భాగంగా భూసేకరణకు సంబందించి సమస్యలను విషయాలను ప్రజలను, నష్టపోయే కుటుంబాలతోచర్చించి వారి అభిప్రాయాలను, సలహాలను సూచనలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైసెస్ సోషల్ ఎక్స్‌పర్ట్ పి.దేవరాజు, ఆర్అండ్‌బి డిఈఈ రాంబాబు, ఎఈఈ గిరీశ్వర్, ఎల్‌ఏ మరియు ఆర్ఆర్ అసిస్టెంట్ ఉదయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధగిరిలో వైభవంగా బుద్ధపౌర్ణమి వేడుకలు



తవణంపల్లె, మే 23 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం బుద్ధపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఈఓ హనుమంతురావు ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వ ర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అర్చకులు మండపంలో సుదర్శనహోమం, ఆకుపూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించడంతో పాటు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు,పాలకమండలి సభ్యులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ ప్రక్రియకు విఘాతం కలిగిస్తే చర్యలు

### కౌంటింగ్ ప్రక్రియలో మూడంచెల భద్రత ఉంటుంది - ఎస్పీ హర్షవర్ధన్ రాజు




రేణిగుంట, మే 23 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టామని, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని, కౌంటింగ్‌కు విఘాతం కల్పిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. రేణిగుంట డీఎస్పీ కార్యాలయం, అర్బన్ పోలీస్‌స్టేషన్, గాజులమండ్యం పోలీస్‌స్టేషన్లను ఎస్పీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలీసులు ఎలాంటి భద్రతలు తీసుకుంటున్నారో ఆరా తీశారు. సమస్యాత్మక గ్రామాల గుర్తింపు రౌడీ షీటర్ల బైండోవర్లు, అల్లర్లు గొడవలు జరిగే చోట పోలీసు పికెటింగ్‌లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అల్లర్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిగువ స్థాయి అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ జరిగే సమయంలో గొడవలు, అల్లర్లు జరిగే ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ప్రతిష్టం చేయాలన్నారు. గొడవలు జరగకుండా అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం సమకూర్చుకోవాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ భద్రతను పటిష్టం చేయడంతో పాటు పోలీసు పికెటింగ్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించామన్నారు. గొడవలు, అల్లర్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసు అధికారులపై ఉందన్నారు. ప్రజలు, స్థానిక రాజకీయనాయకులతో చర్చించి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. అందరూ పోలీసులకు సహకరించాలన్నారు. సహకరించిన వారిపై కేసులు నమోదుచేసి కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. మూడంచెల భద్రతపై ఎస్పీ వివరిస్తూ కౌంటింగ్ కేంద్రాల్లో పారా మిలటరీ బలగాలు, కేంద్రాలకు వెళ్లే గేట్ల వద్ద ఏపీఎస్పీ బలగాలు, ఆ తరువాత కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లి మార్గాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన చెక్‌పోస్టుల వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు బలగాలు, సివిల్ పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్పీతో పాటు స్థానిక డీఎస్పీ భవ్యకిషోర్, అర్బన్ సీఐ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఉచిత చదరంగ శిక్షణ

శ్రీకాళహస్తి, మే 23 ప్రభాతవార్త

పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 5-15వయస్సు మధ్య గల బాలబాలికలకు ఈనెల 25వతేదీ నుంచి వచ్చే నెల 22వ తేదీ వరకు ఉదయం 9.30గం.నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఉచిత చదరంగ శిక్షణ ఇవ్వనున్నట్లు ది చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ నిర్వాహకులు అంజూరుబాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. చివరి రెండు రోజులు చదరంగ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. శిక్షణకు వచ్చేవారు చదరంగ బోర్డు, కాయిన్స్ 200పేజీల నోట్సులు, పెన్‌లు, పెన్సిల్, రెడ్‌పెన్ తీసుకురావాలని కోరారు. అవకాశాన్నిబాలబాలికలు వినియోగించుకోవాలని కోరారు.

## జిల్లాలో గర్భస్త పిండ లింగ నిర్ధారణ చట్టంను పటిష్టంగా అమలు చేయాలి

తిరుచానూరు, మే 23 ప్రభాతవార్త:



జిల్లాలో గర్భస్త పిండ లింగ నిర్ధారణ చట్టంను పటిష్టంగా అమలు చేయాలని ఉల్లంఘన చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేషన్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గర్భస్త పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమే అని ఆడ పిల్లల పట్ల వివక్షత ఉండకూడదని తెలిపారు. గర్భస్త పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణ హత్యలను నివారించవచ్చని అన్నారు. జిల్లాలో ప్రతి నెల అన్ని స్కానింగ్ కేంద్రాల్లో డాక్టర్లు తనిఖీలు నిర్వహించాలన్నారు. గర్భస్త పిండ లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడుతున్న స్కానింగ్ సెంటర్ల వారి రిజిస్ట్రేషన్ తొలగించడం జరుగుతుందన్నారు. స్కానింగ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఇతర మోడిఫికేషన్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ మార్చాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి అనుమతి తప్పని సరిగా పొందాలని తెలిపారు. ఈ చట్టంను అతిక్రమించిన వారికి రూ.50 వేలు జరిమానాతో బాటు 3 సంవత్సరాల కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో 215 స్కానింగ్ సెంటర్స్ ఉన్నాయని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం తెలిసిన వారు 102,104 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, డీఐవో శాంతకుమారి, దిశా డీఎస్పీ కాటమరాజు, గైనకాలజిస్టు డా. మాధవి, పీడీ యాట్రిస్టు డా. కిరిటీ, రేడియాలజిస్టు డా. నాగేశ్వరరావు,డెమో బాబు నెహ్రూ రెడ్డి, డీపీఎంవో శ్రీనివాసరావు, ఎన్‌జీవో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పులివర్తి నానిని పరామర్శించిన తిరుపతి జనసేన నాయకులు



తిరుచానూరు, మే 23 ప్రభాతవార్త:

తిరుపతి మహిళా యూనివర్సిటీలోని మే 14న చంద్రగిరి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై వైసీపీ మూకలు హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. అయితే ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ క్రమంలో గాయపడిన పులివర్తి నాని చికిత్స అనంతరం స్వగృమంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం తిరుపతి జనసేన నాయకులు కిరణ్‌రాయల్, రాజా రాయల్, రఘునాథ్, రిసార్ట్‌లోని పులివర్తి నానిని కలసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## పాలిటెక్నిక్ క్యాంపస్ సెలక్షన్‌లో విద్యార్థుల ప్రతిభ



### ప్రముఖ కంపెనీలకు 64 మంది ఎంపిక

### ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్

చంద్రగిరి, మే 23 ప్రభాతవార్త:

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ తెలిపారు. అగరాల వద్ద గల చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, జి.వెర్నోవా, బ్యాట్ఫీడ్ ఎలక్ట్రికల్ సొల్యూషన్స్ బాలాజీ, బాలాజీ ఫ్యాబ్రికేషన్స్ అండ్ ఎలక్ట్రికల్ సొల్యూషన్స్ వారిచే నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 80 మంది విద్యార్థులు పాల్గొనగా, 64 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు, పేరెంట్స్‌కు ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్.ఎ.ఆర్.ఎల్ సైంటిస్ట్ పి.మునిరాజులు విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.రవికుమార్, విభాగాధిపతులు డాక్టర్ పి.భక్తవత్సలం, డాక్టర్ పి.నాగేంద్ర, డాక్టర్ టి.నరశింహారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం సర్వే

### ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి, మే 23 ప్రభాతవార్త:



ప్రత్యేక అవసరాలు గల బడిఈడు పిల్లల కోసం ఐఈఆర్‌టిలు చేస్తున్న సర్వే పట్ల ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు. తొండవాడ, చంద్రగిరి పంచాయతీలలో ప్రత్యేక అవసరాలు గల బడిఈడు పిల్లల కోసం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేని తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు, వివిధ అలవెన్స్‌లు సమగ్రశిక్ష ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు గల బడిఈడు పిల్లల సమాచారం వున్నట్లయితే చంద్రగిరి శ్రీపద్మావతి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత స్కూల్‌కు తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టిలు ఎస్.వెంకట రాజేశ్వరి, ఎస్.శ్యామలాదేవి పాల్గొన్నారు.

## కౌంటింగ్‌లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చూడాలి

### కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



తిరుపతి కార్పొరేషన్, మే 23, ప్రభాతవార్త

జూన్ 4వ తేది జరిగే కౌంటింగ్‌లో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కోరారు. కౌంటింగ్ సందర్భంగా తిరుపతిలో శాంతి భద్రతలు సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. గురువారం ఉదయం ఆరణి శ్రీనివాసులు స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. స్ట్రాంగ్ రూం పరిశీలించిన తరువాత మీడియాతో ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం వద్ద ఐదెంచెల భద్రత కట్టుదిట్టంగా కొనసాగుతోందని అన్నారు. తిరుపతి నియోజకవర్గంలో పోలింగ్ రోజు ఈవిఎంలు మెరాయించడంతో ఓటర్లు గంటల కొద్ది వేచి చూడాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. కౌంటింగ్ రోజు ఈవిఎంల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు ఎన్నికల సంఘం తీసుకోవాలని ఆయన కోరారు. పోలింగ్ ఏజెంట్స్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్న వారిపై సైబర్ క్రైం అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఏజెంట్ మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

## పులివర్తి నానికి తుమ్మలగుంట టిడిపి నాయకులు పరామర్శ

తిరుపతిరూరల్, మే 23 ప్రభాతవార్త:



ఈనెల 14న పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈవిఎం స్ట్రాంగ్‌రూమ్స్ పరిశీలనకు వెళ్ళిన చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై వైకాపా నాయకుల దాడిలో నాని అస్వస్థకు గురైన విషయం తెల్సిందే. స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకొంటున్న నానిని గురువారం తుమ్మలగుంట టిడిపి నాయకులు, రాష్ట్ర వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శి బిరుదాల భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. నాని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిరుదాల వేణుగోపాలరెడ్డి, కేశవులశెట్టి, మాజీ ఎంపిటిసిసభ్యులు సరస్వతి, తులసీరామిరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, ఎస్.బాలు, చైతన్య, ముని పాల్గొన్నా రు.

## బస్సులన్నీ తిరువణ్ణామలైకు : స్థానిక భక్తుల తిప్పలు

### ఓ వైపు వేసవిసెలవులతో భక్తుల సతమతం



శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త

పౌర్ణమి అంటే ఇటీవలకాలంలో ప్రయాణీకుల తిప్పలు వర్ణనాతీతంగా మారింది. తెలుగురాష్ట్రాల నుంచి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని తమిళనాడుకు పొరుగున ఉన్న జిల్లాల నుంచి అన్ని ఆర్‌టిసి డిపోలు బస్సులను తిరుణ్ణామలైకు మళ్ళిస్తున్నారు. ఆర్‌టిసి అధికారులు లాభార్జనకు నిర్ణయాలు తీసుకోవటం మంచిదే. అయితే ఈ నిర్ణయం ప్రయాణీకులకు శాపం కాకూడదు. ఇబ్బందులు కల్గించకూడదు. ఓ వైపు పొరుగున ఉన్న కర్నాటక,తమిళనాడు రాష్ట్రాలు ప్రతి ఏడాది కొత్త బస్సులతో లాభాలు సంపాదిస్తుంటే ఆంధ్ర ప్రదేశ్‌లో ఎపి ఆర్‌టిసి కాలం చెల్లిన బస్సులతోనే మనుగడసాగిస్తున్నారు. అవికూడా సకాలంలో నడపటంలో విఫలమౌతున్నారు. శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపోలో వాహనాల పరిస్థితి దయనీయంగా మారింది. సుమారు 15 సంవత్సరాల క్రితం నాటి మెట్రోలైనర్స్‌తో నాన్‌స్టాప్‌లను తిరుపతి-శ్రీకాళహస్తి మధ్య నడుపుతున్నారు. ఇక పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని బస్సులన్నీ తిరువణ్ణామలైకు ఆ ప్రభుత్వం మళ్ళిస్తుంది. ఆ రోజు శ్రీకాళహస్తినుంచి చెన్నైకు వెళ్ళాల్సిన ప్రయాణీకుల అవస్థలు వర్ణనాతీతంగా మారుతుంది. ఆ సమయంలో ఆంధ్రా బస్సులను నడపవచ్చు. కానీ ఆ చొరవ చేయరు. ఇక తమిళనాడు ఆర్‌టిసి చెన్నై-శ్రీకాళహస్తి-తిరుపతి మధ్య ప్రతి గంటకు ఏసి బస్సులను నడుపుతున్నారు. కానీ ఎపి ఆర్‌టిసి సాధారణ బస్సులనే సక్రమంగా నడపలేని దయనీయ స్థితిలో ఉంది. గురువారం తిరుపతి శ్రీకాళహస్తి మధ్య బస్సుల్లేక భక్తులు పడ్డ అవస్థలుఅంతాఇంతా కాదు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఈతకు వెళ్ళి వ్యక్తి మృతి



తొట్టంబేడు, మే 23 ప్రభాతవార్త

టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న బసవయ్యపాళెం గ్రామంలో ఉన్న బావిలో ఈతకు వెళ్ళి ఓయువకుడు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. దీంతోవిషయం తెలుసుకున్న సిఐ రారాజు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. బసవయ్యపాళెం గ్రామానికి చెందిన బి.నరసింహారెడ్డి కుమారుడు బి.రాజేష్(31) గ్రామంలో ఉన్న బావిలో తన స్నేహితులతో కలసి ఈతకు దిగాడు. ఈత పూర్తయిన తర్వాత వస్తుండగా ప్రమాదవశాత్తు తిరిగి బావిలోపడడంతో మృతిచెందాడు. దీంతో వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పి.తిరుమలరెడ్డి, పి.నాగార్జునరెడ్డి, సునీల్‌కుమార్, ధనశేఖర్, రాజ, మహేశ్వర్‌రెడ్డిలు బావిలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసునమోదుచేసినట్లు సిఐ తెలిపారు.

## కౌంటింగ్ ఏర్పాట్లు నిబంధనల మేరకు చేపడుతున్నాం

### - ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుచానూరు, మే 23 ప్రభాతవార్త: కౌంటింగ్ సక్రమంగా నిర్వహించి ఫలితాలు కౌంటింగ్ రోజున సాయంత్రం 4 గంటల లోపు పూర్తిగా ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కౌంటింగ్ సన్నద్ధతిపై చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేయగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి తిరుపతి, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ సంబంధిత అధికారులతో కలసి హాజరై మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేలా నిబంధనల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులోసీఈవో వీసీలో కలెక్టర్ హాజరై మాట్లాడుతూ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ సహాయకులు, మైక్రో అబ్జర్వర్లుకు విదుల కేటాయింపు కొరకు ఫస్ట్ ర్యాండమైజేషన్ ఈ నెల మే 26న, రెండవ రాండమైజేషన్ జూన్ 3న అబ్జర్వర్ సమక్షంలో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మే 22న బుధవారం కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బందికి మొదటి దశ శిక్షణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేపడుతున్నామని, తగినంత కేంద్ర బలగాలు రావడం జరిగిందని స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రం వద్ద శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం ఎంట్రీ వద్ద భద్రత ఏర్పాట్లను చేశామని తెలిపారు. 90 సీసీ కెమెరాలు ఏర్పాటుతో, స్ట్రాంగ్ రూం దాని చుట్టు పక్కల పరిసర ప్రాంతాలు కవర్ అయ్యేలా ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు 4 తేదీన సాయంత్రం 4 కల్లా పూర్తయ్యేలా ఏర్పాట్లు చేపడుతున్నామని, ఈవీఎం కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు కూడా ఆ లోపు పూర్తి చేస్తామని తదనుగుణంగా ఏర్పాట్లుచేస్తున్నామని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ 15 టేబుల్ ఏర్పాటుతో 3 రౌండ్లలో పూర్తి చేసేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సీసీటీవీ కెమెరాలు వద్ద అభ్యర్థులు వారి ఏజెంట్లు పరిశీలించేలా ఏర్పాటుచేశామని తెలిపారు. ఈసీఐ, సీఈవో ఏపీ వారి మార్గదర్శకాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సీఈవోకు వివరించారు.

# తిరుపతి డివిజన్

## చెత్తకుప్పలోకి చేరిన చెత్త బండి

కేవీబీ పురం, మే 23 ప్రభాతవార్త:

గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను సేకరించడం కొరకు ట్రై సైకిల్, ఈ ఆటోలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వేచించి బృందావనాలను(డంపింగ్‌యార్డు)లను ఏర్పాటు చేసింది. అయితే కేవీబీ పురం మండలంలోని కాట్రపల్లి సచివాలయ పరిధిలో చెత్త సేకరణకు వినియోగించాల్సిన ట్రై సైకిళ్ల మరమ్మతుకు గురికావడంతో ఆ ట్రై సైకిళ్లు కూడా చెత్తకుప్పలో దర్శనమిస్తుండడంతో అధికారులు, నాయకులు ప్రభుత్వ ఆశయాలను తుంగలోతొక్కుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి మరమ్మతుకు గురైన ట్రై సైకిళ్లు, ఈ ఆటోలను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## యువకుడు ఆత్మహత్య

కేవీబీ పురం, మే 23 ప్రభాతవార్త:

మండలంలోని వగత్తూరు ఎస్టీ కాలనీలో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వగత్తూరు ఎస్టీ కాలనీకిచెందిన దేశయ్య కుమారుడు చెంచయ్య(35) బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద చిన్నపాటి గొడవ రావడంతో కలత చెంది పురుగుల మందు తాగినట్టు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కొరకు కేవీబీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే మార్గమధ్యలోనే మరణించినట్లు వైద్యులు తెలిపారు. సంబంధిత విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## తీరిన దళితవాడ తాగునీటి కష్టాలు

కేవీబీ పురం, మే 23 ప్రభాతవార్త:

మండలంలోని కళత్తూరు దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్య తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ చొరవతో తీరింది. చేతి బోరు, విద్యుత్ మోటారు కొద్ది నెలల కిందట మరమ్మతులకు గురయ్యాయి. మరమ్మతుల నిమిత్తం విప్పిన బోరును అధికారులు బిగించకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. గ్రామస్థులు నీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. సమస్యను ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గ్రామస్థులు మొర పెట్టుకున్నారు. ఎంపీ గురుమూర్తి జిల్లా అధికారులను సంప్రదించి మండల, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో కళత్తూరుకు అధికారులు చేరి సమస్యను పరిష్కరించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## టపాకాయల దుకాణం సీజ్

వడమాలపేట, మే 23 ప్రభాతవార్త:



వడమాలపేటలో పర్మినెంట్ లైసెన్స్ కార్తికేయ క్రాకర్స్ దుకాణాన్ని గురువారం తహసీల్దార్ రాజసింహ సీజ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం దుకాణంలో స్టాక్‌ను పరిశీలించి జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. జూన్ నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఏ పార్టీ నాయకులు, అభిమానులు టపాకాయలు కాల్చరాదని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

## వైభవంగా పౌర్ణమి పూజలు

విజయపురం, మే 23 ప్రభాతవార్త:



మండలంలోని జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో గురువారం పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేక నిర్వహించి తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని కోసలనగరం మిట్టూరు రామక్కమ్మ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహకులు రాంప్రసాద్‌శర్మ, వాసుదేవస్వామి, భక్తులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో ఘనంగా బుద్ధ పూర్ణిమ పూజలు

నారాయణవనం, మే 23 ప్రభాతవార్త :



గురువారం మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహాస్వామి ఆలయాల్లో బుద్ధ పూర్ణిమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. నెయ్యి, కొబ్బరినీరు, పసుపు, కుంకమ, చందనం, విభూది వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అంతకుముందు పవిత్ర జలపాతంలో స్నానాలను చేసారు. మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా అన్నదానం చేసారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయులస్వామి ఆలయంలోను బుద్ధ పూర్ణిమ పూజలను ఘనంగా జరిపారు. స్వామివారికి అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహారంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన ం నిర్వహించారు.

## భీమునిచెరువులో శ్రీఎల్లమ్మ తిరునాళ్లు ప్రారంభం

నారాయణవనం, మే 23 ప్రభాతవార్త :



మండలంలోని భీమునిచెరువులో వెలసిన గ్రామదేవత శ్రీ ఎల్లమ్మ తల్లి తిరునాళ్లు బుధవారం కాపు కట్టడంతో ప్రారంభమైనది. ఈ ఉత్సవాల్లో రెండవ రోజు గురువారం సాయంత్రం 6నుంచి7 వరకు ప్రత్యేక పూజలను చేశారు. 24వతేది శుక్రవారం ఉదయం 6గంటలకు గెరిగ ఊరేగింపు, 25వతేది శనివారం ఉదయం 8గంటలకు పాలాభిషేకం, అన్నదానం, 26వతేది ఆదివారం ఉదయం భక్తులు ముళ్ల గుచ్చుట, పొంగళ్లు పెట్టడం, సాయంత్రం 6గంటలకు అగ్నిగు ండ ప్రవేశం, రాత్రి 9.30గంటలకు అమ్మవారి గ్రామవీధి ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. తిరునాళ్లతో రెండు రోజుల ముందే అమ్మవారి అర్చీలు, విద్యుత్ తోరణాలు, దీపాలంకరణ చేశారు.

## పంచాయతీ ఆదాయానికి

### గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోండి

రేణిగుంట, మే 23 ప్రభాతవార్త:



రేణిగుంట మేజర్ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని 15వ వార్డు మెంబరు ఎంజీ రెడ్డి, 1వ వార్డు మెంబరు విజయలక్ష్మి డిమాండ్ చేస్తూ గురువారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. రేణిగుంట పంచాయతీ పాలకవర్గంలోని కొంత మంది పాలకవర్గ సభ్యులు ఎన్నికల కమిషన్ నిబంధనలకు తూట్లు పొడుస్తూ, ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా కొళాయి కనెక్షన్లు ఇచ్చారంటూ వార్డు మెంబర్లు ఎంజీ రెడ్డి, విజయలక్ష్మి అన్నారు. ముఖ్యంగా ఎలెక్షన్లకు మూడు రోజులు ముందు ఓట్ల కోసం కొలాయి కనెక్షన్లు పేరుతో ప్రలోభాలకు గురి చేశారన్నారు. రేణిగుంట పంచాయతీలోని వివిధ వీధుల్లో కొళాయి కనెక్షన్లు ఇచ్చారన్నారు. తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై ఎంపీడీవో వివరణ ఇస్తూ వార్డు మెంబర్లు ఎం.జి.రెడ్డి, విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదును ఈవోపీఆర్‌డీకి పంపామన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

## కన్నులపండువగా అగ్నిగుండ మహోత్సవం

తొట్టంబేడు, మే 23 ప్రభాతవార్త



మండలంలోని గౌడమాల గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవంలో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్‌రెడ్డి పాల్గొన్నారు. గౌడమాల గ్రామస్తులు భరత్‌రెడ్డికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అగ్నిగుండ మహోత్సవాన్ని ప్రారంభించి మొక్కులుతీర్చుకున్నారు. క ఆర్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అనునిత్యం అప్రమత్తం

- పక్కాగా బ్యారికేడింగ్ వ్యవస్థ ఏర్పాట్లు - ఎస్వీ సెట్‌లో స్ట్రాంగ్ రూమ్స్‌ను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు


ఓట్ల లెక్కింపు కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు.

చిత్తూరు, మే 23 ప్రభాతవార్త: ఇవిఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్స్ వద్ద అనునిత్యం అప్రమత్తంగా వుండి విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ పి.శ్రీనివాసులు పోలీసు అధికారులను ఆదేశించారు. చిత్తూరు మురకంబట్టు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్, మీడియా సెంటర్ ఏర్పాటు, సి అండ్ డి స్ట్రాంగ్ రూమ్స్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు జరిగే వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. పుంగనూరు, నగరి, జిడినెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాలకు విడివిడిగా ఓట్ల లెక్కింపు నిర్వహించడానికి చేసిన ఏర్పాట్లను జెసి పరిశీలించి పక్కాగా బ్యారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి అధికారులు సమన్వయంతో బ్యారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జెసి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్, సి అండ్ డి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, చిత్తూరు అర్డీఓ చిన్నయ్య, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, మెటీరియల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి షణ్ముగం, తహసిల్దారు శ్రీనివాసులురెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లీగల్ విక్రయాలపై దృష్టి**

**- పెట్రోల్ బంకులు, సివిల్ సప్లై స్టాక్ పాయింట్ల తనిఖీకి జాయింట్ కలెక్టర్ ఆదేశాలు**

పెట్రోల్, డిజీల్ ఇల్లీగల్ అమ్మకాలపై దృష్టి కేంద్రీకరించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఇఓఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, విఆర్‌ఓలు, మహిళా పోలీసులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు గురువారం అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లీగల్ పెట్రోల్, డిజీల్ అమ్మకాల నిషేధంపై అర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ పెట్రోల్, డిజీల్ ఇల్లీగల్ అమ్మకాలు జరుగకూడదని స్పష్టం చేశారు. పెట్రోల్ బంకుల యాజమానులు ఎవరికి గాని క్యాన్స్, బాటిళ్ళు, డ్రమ్స్ తదితరాల్లో పెట్రోల్, డిజీల్‌లు నింపి విక్రయించరాదని ఈ సమాచారంను జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల యాజమానులకు తెలియజేయాలన్నారు. అలాగే పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే నిత్యవసర వస్తువుల స్టాక్ పాయింట్లను పరిశీలించని అర్డీఓలు రెండు రోజుల్లోగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఒక మండలంలో సగ భాగంలో వున్న పెట్రోల్ బంకులను తహసిల్దారు, మరో సగం భాగం వున్న పెట్రోల్ బంకులను ఎంపిడిఓలు తనిఖీలు చేయాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమీషనర్లు డిప్యూటీ తహసిల్దార్లతో కలిసి ఇల్లీగల్‌గా పెట్రోల్, డిజీల్ అమ్మకాలు జరుగుతుంటే గుర్తించి సీజ్ చేసి అక్కడి స్టాకును పౌరసరఫరాల శాఖకు అప్పగించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా రోడ్లపై ఇల్లీగల్‌గా పెట్రోల్, డిజీల్ అమ్మకాలు సాగుతుంటే పంచాయతీ సెక్రటరీల, విఆర్‌ఓలు, మహిళా పోలీసులు సీజ్ చేసి బైండోవర్ కేసులు పెట్టాలన్నారు. అలాగే తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి పెట్రోల్, డిజీల్ తీసుకువచ్చి ఇక్కడ అధిక రేట్లకు అమ్ముతున్నారని అలాంటి వారిపై బైండోవర్ కేసులతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకులు, సెల్ టవర్స్, పవర్‌లూమ్స్, అసుపత్రుల జనరేటర్లకు అవసరం మేరకు సంబంధిత తహసిల్దార్లను సంప్రదించి వారి నుండి అవసరం మేరకు లెటర్ తీసుకొని పెట్రోల్ బంకులకు ఇస్తే అలాంటి వారికి పెట్రోల్, డిజీల్ పోస్తారన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎస్‌ఓ శంకరన్, ఎఎస్‌ఓ శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం

కాణిపాకం, మే 23 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో గురువారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయ ంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

**ఘనంగా పున్నమి గరుడసేవ :**

శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సత్యనారాయణ వ్రతంను నిర్వహించగా రాత్రి గరుడసేవను నిర్వహించారు. ఆసందర భంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## కపిలేశ్వరునికి విరులసోయగం



తిరుపతి,మే 23ప్రభాతవార్త: ఆలయంలో పలు రకాలుగా తెలిసీతెలియక జరిగిన దోషాల నుండి పరిహారం కోసం గురువారం ఉదయం కపిలేశ్వరస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా పత్రపుష్పయాగం నిర్వహించారు. 12రకాల పుష్పాలు, 6రకాల పత్రాలతో కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మ ఉత్సవర్లను వేదమంత్రోచ్చరణల నడుమ పుష్పాలతో అర్చించారు.

## హిందూ సనాతన ధర్మాన్ని మరింత విస్తృతంగా వ్యాప్తి చేయాలి

**-వెంగమాంబ జయంతిలో స్వరూపానందస్వామి**



తిరుపతి,మే 23ప్రభాతవార్త: హిందూ సనాతన ధర్మాన్ని మరింత విస్తృతంగా వ్యాప్తిచేయడంలో టిటిడి సోషల్‌మీడియా వేదికగా వినియోగించుకోవాలని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి సూచించారు. వెంగమాంబ అప్పుడే మహిళ సాధికారత, మహిళలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారన్నారు. తరిగొండ వెంగమాంబ పేరున అన్నదానం కూడా ప్రారంభించిందన్నారు. వెంగమాంబ జయంతి వేడుకల్లో స్వామి పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఈఓ గౌతమి, శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి, వెంగమాంబ ప్రాజెక్టు సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## అలరించిన సప్తగిరి సంకీర్తన గోష్టిగానం



అన్నమాచార్యజయంతి సందర్భంగా తిరుపతిలోని అన్నమాచార్యకళామందిరంలో జరిగిన సప్తగిరి సంకీర్తన గోష్టిగానం అలరించింది. గురువారం ఉదయం ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు గోష్టిగానం చేశారు.

ప్రభాతవార్త-తిరుపతి

## గంగమ్మ హుండీ ఆదాయం రూ.37లక్షలు



తిరుపతి, మే 23 ప్రభాతవార్త:తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జాతర ముగిసిన తరువాత గురువారం ఉదయం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. ఆలయ ఈఓ మమత ,ఈస్టు పోలీసులు, బ్యాంకు ఉద్యోగులు, ఆలయ ఉద్యోగులు పాల్గొని హుండీల కానుకలు లెక్కించారు. జాతర సందర్భంగా అమ్మవారికి 37,05,178రూపాయలు నగదు, 13.300గ్రాముల బంగారు, 105.386గ్రాముల వెండి ఆభరణాలు ఆదాయం లభించింది.

## గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు



చంద్రగిరి, మే 23 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారు శ్రీ మహావిష్ణువు అలంకరణలో గరుడవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకు వచ్చి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి గరుడవాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ నిండు పున్నమి వేళ దేవదేవుడు ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు నారాయణం శేషాచార్యులు, నారాయణాచార్యులు, సిబ్బంది రవిచంద్రన్, నల్లూరి విష్ణుమూర్తి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్నను దర్శించుకున్న శ్రీశారదాపీఠం స్వామి



చంద్రగిరి, మే 23 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారిని గురువారం విశాఖపట్నం శ్రీశారదాపీఠం శ్రీశ్రీ స్వరూపానంద స్వామి దర్శించుకున్నారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాధ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వామి వారి దర్శన ఏర్పాట్లను గావించారు. తదుపరి ఆలయ పడికావలి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి జమేదర్ మంకు చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

## కరాటేలో గోల్డ్ మెడల్స్ సాధించిన తిరుపతి విద్యార్థులు

తిరుపతి క్రీడ, మే 23 ప్రభాతవార్త : గోవాలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో తిరుపతి బైరాగిపట్టెడలోని కెన్ బు కామ్ సిటోరియో స్కూల్ ఆఫ్ కరాటే నందు కరాటే మాస్టర్ రత్నాకర్ వద్ద శిక్షణ పొందిన సోనిక, వర్ణిక, వెంకట్, సుజిత, సూర్య, లోకేశ్వర్ రెడ్డి, ధనుష్, రవీంద్ర, కిరణ్ కుమార్, తదితర విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. వీరిలో సోనిక, వర్ణిక,సూర్యలు జపాన్‌లో జరుగు అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని స్థానిక రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మెడల్స్ సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా కరాటే మాస్టర్ రత్నాకర్‌ను సత్కరించి అభినందించారు. జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి తిరుపతి నగరానికి రాష్ట్రానికి , దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కెఎన్ రాజా, సుబ్రమణ్యం రెడ్డి, కరాటే మాస్టర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ఊరందూరులో గరుడ సేవ



శ్రీకాళహస్తిరూరల్, మే 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి గరుడ సేవను కన్నులపండువగా నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయం నుంచి గిన్నెబిక్ష-మోహినీ ఉత్సవాన్ని నాలుగుమాడావీధుల్లో ఘనంగానిర్వహించారు. ఆలయం తరఫున ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్‌లు ఉత్సవాలను నిర్వహించారు. కాగా రాత్రి 'గరుడ సేవను'అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ఆలయంలో ముస్తాబు చేసి గరుడవాహనంపై ప్రతిష్టించారు. ఉభయదారులుబొజ్జల సుధీర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, బంగాలపల్లితులసీరాంరెడ్డి తరఫున వారి కుటుంబసభ్యులు హాజరు కాగా ఉత్సవం నాలుగుమాడావీధుల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు.

**నేడు కళ్యాణోత్సవం:**

ఊరందూరులోని చెన్న కేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం నిర్వహించుటకు విస్తృత స్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇన్‌చార్జి లక్ష్మయ్య తెలిపారు. ఉదయం తిరుచ్చి వాహనం ఉత్సవంనిర్వహించిన తరువాత ఆలయంలో రాత్రి కళ్యాణోత్సవం తరువాత గజవాహన సేవను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## నిదురపో స్వామీ నిదురపో...!



చౌడేపల్లి, మే 23 ప్రభాతవార్త : స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రథమ శయనోత్సవం నిర్వహించారు. ఉదయాన్నే అభిషేక ప్రియుడికి ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితుల ఆధ్వర్యంలో విశేషాభిషేకం, అలంకరణ గావించారు. రాత్రి శయనోత్సవం జరిగిన తీరు భక్తులను అలరించింది. ఈ కార్యక్రమానికి జమీందారు వంశీయులు ఎస్.రాజేంద్ర రాయల్, రాజా రమేష్‌రాయల్, బసవరాజరాయల్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

## బోయకొండపై వైభవంగా చండీహోమం



బోయకొండ(చౌడేపల్లి), మే 23 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండపై చండీహోమంగురువారం నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమిన కొండపై దంపతులు, భక్తులు సమక్షంలో చండీహోమాన్ని నిర్వహిస్తున్నారు. దీనివల్ల లోకం శుభిక్షంగా ఉంటుందని భక్తులు నమ్ముతారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు గోవర్ధనశర్మ, అర్చకులు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో హోమాన్ని సాంప్రదా యబద్ధంగా నిర్వహించారు. ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలు వసతులు సమకూర్చారు.

## గణనాధుని సన్నిధిలో రాష్ట్ర ఆర్టీఐ కమీషనర్



కాణిపాకం, మే 23 ప్రభాతవార్త: ఏపీ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ యు.హరిప్రసాద్‌రెడ్డి గురువారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. కమీషనర్ వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చవటగుంట, పచ్చికాపల్లం మహాభారత శ్రీకార కోడోత్సవాలు



వెదురుకుప్పం, మే 23 ప్రభాతవార్త : మండలంలోని చవటగుంట, పచ్చికాపల్లం మహాభారత వార్షికోత్సవాల ప్రారంభంలో భాగంగా గురువారం ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయాల్లో శ్రీకార కోడోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభించారు. ఆలయాలు శుద్ధిచేసి మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు, పంచపాండవుల ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రలు, పూలతో అలంకరణ చేసి శాస్త్రయుక్తంగా వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు దైవదర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీకార కొడి కార్యక్రమంకు చవటగుంట మహాభారతం వద్ద బండి సోమసుందర్ రెడ్డి, పచ్చికాపల్లం మహాభారతంకు పోడుచేను గ్రామస్థులు ఉభయదాతలుగా వ్యవహారించారు. వార్షికోత్సవంలో భాగంగా ఉత్సవమూర్తులను భారతం సంబంధించిన గ్రామాల్లో ఊరేగింపు చేయడం ఆనవాయితీ దీని ప్రకారం ఉత్సవ మూర్తులను ఊరేగింపుకు తీసుకువెళ్ళడం జరిగింది. ఈ కార్యక్రమంలో చవటగుంట ఆలయ ధర్మకర్త పేటరాధాకృష్ణా రెడ్డి, కార్యనిర్వాహకులు కృష్ణా రెడ్డి, మోహన్ రెడ్డి, జీవన్ బాబు, జయరాం, నరసింహా రెడ్డి, భాస్కర్ రెడ్డి, సభాపతి రెడ్డిలు, పచ్చికాపల్లం భారతం వద్ద ఆలయ కమిటీ సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి, రవికుమార్, నరేష్ రెడ్డి, బొజ్జా రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగరత్నం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతి గంగమ్మకు 34.44లక్షల ఆదాయం

**- గతేడాది కంటే లక్ష తగ్గిన ఆదాయం.. ఎన్నికల కోడ్.. విఐపి దర్శనాలు లేకపోవడమే కారణం !!**



కుప్పం,మే 23 ప్రభాతవార్త : జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మ వారికి భక్తుల కానుకల రూపంలో రూ 34,44, 290ల ఆదాయం లభించింది. గురువారం అసిస్టెంట్ కమీషనర్ ప్రసన్న లక్ష్మి, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఆలయ ఛైర్మన్ కెఎ మంజునాథ్‌కుమార్,ఇఓ చలపతి సమక్షంలో అమ్మవారి ఆలయంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా అమ్మవారికి నగదు రూపంలో రూ 34,44,290ల ఆదాయం వచ్చింది. అలాగే 82.5 గ్రాముల బంగారం, వెండి 241.8గ్రాముల మేర వచ్చింది. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా గతేడాది కంటే అమ్మవారికి ఆదాయం తగ్గింది. ఎన్నికల కోడ్ ఉండడం, విఐపి దర్శనాలు లేకపోవడంతో అమ్మవారి ఆదాయం సుమారు 1.12లక్షల మేర ఆదాయం తగ్గింది.

## జాతర జనంతో కిటకిటలాడిన రైళ్లు



కుప్పం, మే 23 ప్రభాతవార్త : కుప్పం పట్టణంలోని రైల్వే స్టేషన్, బెంగళూరు - చెన్నై మధ్య తిరిగే రైళ్లు గురువారం కిటకిటలాడాయి. జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతరకు భక్తులు కుప్పం పరిసర ప్రాంతాలనుంచే కాక కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలనుంచి లక్షల సంఖ్యలో హాజరయ్యారు. బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర ముగిసిన నేపథ్యంలో గురువారం జాతరకు వచ్చిన జనం తమ సొంత ప్రాంతాలకు తరలేందుకు పెద్ద ఎత్తున కుప్పం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ప్రధానంగా బెంగళూరు - కుప్పం మధ్య తిరిగే పుష్‌పుల్ రైలు అయితే నిల్చోనేందుకు సైతం చోటు లేక కిక్కిరిసిపోయి కన్పించింది.

## స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయాలి

**కమిషనర్ అధితి సింగ్**



తిరుపతి కార్పొరేషన్, మే 23 ప్రభాతవార్త : తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని గురువారం స్మార్ట్ సిటీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతో తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐట్రిపుల్ సి పనులు నెమ్మదిగా నడుస్తున్నాయని, పనులు వేగవంతం చేయాలన్నారు. కచ్చపి ఆర్ట్ బ్లాక్ వద్ద ఏర్పాటు చేయబోవు కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సిటీ ఆపరేషన్ ఎసెంటర్ పనులపై సమీక్షిస్తూ పనులు వేగవంతం పై దృష్టి సారించాలని, ముఖ్యంగా సిఓసి బిల్డింగ్ పూర్తి చేయడంతో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రజలకి అందుబాటులోకి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అదే విధంగా మల్లి లెవల్ కార్ పార్కింగ్ పనులు, ఇతర పనులు స్థితి గతులపై చర్చించి పనుల వేగవంతానికి కాంట్రాక్టర్లు పని చేయాలని, నిర్మాణాల పనులపై అధికారులు దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు జరుగుతున్న పనుల వివరాలను తనకు నివేదించాలని తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎండి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ తెలిపారు. సమావేశానికి ముందు పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థానంలో నిర్మితమవుతున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణ పనులను కమిషనర్ అధితి సింగ్ పరిశీలించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈఈ విజయకుమార్ రెడ్డి, ఏయికాం సంస్థ ప్రతినిధి బాలాజీ, ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామి, మేనేజర్ చిట్టిబాబు, స్మార్ట్ సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## కరియమాణిక్యస్వామికి కంచి గరుడసేవ

**మాడవీధుల్లో విహరించిన శ్రీవారు**

నగరి, మే 23 ప్రభాతవార్త: పట్టణ పరిధిలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధీనంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో గురువారం కంచి గరుడసేవ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నేత్రపర్వంగా అలంకరించిన గరుడ వాహనంపై దేదీప్యమానంగా కరియమాణిక్య స్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. తిరుమల దేవస్థానం వారు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం ఆలయం నుంచి ప్రారంభమైన గరుడ వాహనం కోలాటాలు, భజన బృందాలు, వేద పారాయణాలు, మంగళవాయిద్యాలు, కళాకారుల నృత్య ప్రదర్శనలతో స్వామి వారు గరుడ వాహనంపై మాడవీధుల్లో విహరించారు. ఊరేగింపుగా వస్తున్న స్వామివారిని దర్శించుకోవడానికి మాడవీధుల్లో భక్తులు బారులు తీరారు. పుష్పాలు, కొబ్బరి కాయలు సమర్పించి కర్పూర హారతులు స్వీకరించారు. కుంకుమ ప్రసాదాలను అందుకున్నారు. మండుటెండను సైతం లెక్కచేయక ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు ప్రతి వీధిలోను నివాసితులు మజ్జిగ, సీతలపానీ యాలు, తాగునీరు అందించి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం శ్రీవారిని ఆలయానికి చేర్చారు. నగరి పోలీసుశాఖ వారు, మున్సిపల్ శాఖ, టీటీడీ ఆలయ సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టారు.


పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

**కంచి గరుడవాహనంపై కరివరదుడు**

మున్సిపల్‌పరిధి సత్రవాడలో టీటీడీ ఆధీనంలోని కరివరదరాజ ఆలయంలో గురువారం కంచి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. కంచిలో ప్రాధాన్యత సంతరించుకున్న గరుడసేవ అక్కడ వరదరాజ పెరుమాళ్‌కే చేస్తారు. అదే పేరుతో స్వామి కొలువైన ఆలయం కావడంతో ఈ ఉత్సవాలు ఇక్కడ ప్రాధాన్యతను సంతరించుకుంది. భారీ గరుడవాహనంపై స్వామివారు పట్టు పీతాంబరధారిగా సుందరవదనంతో విహరించారు. భక్తులు ఊరేగింపుగా వస్తున్న స్వామివారిని దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. మాడవీధుల్లో సంచరించిన అనంతరం స్వామివారిని ఆలయంలో సేద తీర్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో నాగరత్నం, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్, జానకిరామ్, ఎన్ఎస్ఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరులు, ప్రధానఅర్చకులు నరసింహప్రసాద్, ధన్వంతరి ఆచార్యులు,బాలాజీ ఆచార్యులు, స్థానిక సలహా సభ్యులు పాల్గొన్నారు.